క్లుప్తంగా

పంచాయతీ ట్రాక్టర్ల ఈఎంఐలు మాఫీ చేయాలి



మంత్రి హరీశ్‌రావుతో సర్పంచ్‌లు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ట్రాక్టర్ల ఈఎంఐలు మాఫీ చేయాలని కోరుతూ మండలంలోని సర్పంచ్‌లు శనివారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. చిన్న గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ ఇబ్బందిగా ఉందని, ఈఎంఐలు మాఫీ చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పంచాయతీల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, సర్పంచ్‌లు రాజేశ్వరీరవి, భిక్షపతి, జహంగీర్, కుమార్, సత్యం, కల్పనస్వామి, లావణ్యమల్లేశం, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌రూరల్: సత్వర, సమన్యాయం కోసం లోక్ అదాలత్ చక్కని వేదికని, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ అదనపు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకొని పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ కోర్టు పరిధిలోని పోలీసులు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



స్నిగ్ధను సన్మానిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్


బెజ్జంకి(సిద్దిపేట): జాతీయ మినీ అండర్-14, ఓపెన్ 9 ఆర్చరీ విభాగాల్లో దాచారం గ్రామానికి చెందిన బండి స్నిగ్ధ 3 స్వర్ణ పతకాలు సాధించింది. శనివారం స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గ్రామ పంచాయితీలో శాలువాతో ఆమెను సన్మానించారు. మూడు పతకాలు సాధించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారుజ.

బుగ్గరాజేశ్వరుడి దుకాణాల వేలం రూ.3.52లక్షలు

సిద్దిపేటరూరల్: స్వయంభూ బుగ్గరాజేశ్వర స్వామి దేవస్థానం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన దుకాణాల బహిరంగ వేలంలో రూ.3లక్షల 52వేలు వచ్చినట్లు దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్ తెలిపారు. బహిరంగ దుకాణాల వేలం కొబ్బరి కాయలు, నూనె గురుగులు, ప్రసాదాలు వంటి వాటికి వేలంలో పాల్గొన్న వారు రూ.3లక్షల 52వేలకు సొంతం చేసుకున్నారు. అదేవిధంగా రాబోయే శివరాత్రి ఉత్సవాలకు గాను అన్నిర కాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కిషన్, ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ చందు, ఆలయ కమిటీ సభ్యులు చల్ల సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, రాణి రఘుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, సర్పంచ్‌లు శంకర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపసర్పంచ్ స్వామి, ఆలయ అర్చకులు సీతారామశర్మ పాల్గొన్నారు.

దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



తిమ్మక్కపల్లిలో కురుమ సంఘ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక ప్రజలు గత ఉప ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోసపోయి గోస పడుతున్నారని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు, ఎస్సీ, రెడ్డి, యాదవ కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం నీటి శుద్ధీకరణ కేంద్రం ప్రారంభించారు. పలువురు యువకులకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమాల పురిటి గడ్డ అయిన దుబ్బాకలో రానున్న ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదగిరి, ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి, రాష్ట్ర నాయకులు మామిడి మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రయాణికులకు వసతులు కరువు

- దుబ్బాక బస్టాండ్‌లో మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానం
- మున్నాళ్ల ముచ్చటగా అభివృద్ధి పనులు



మరుగుదొడ్ల వెనకాల మురుగు

దుబ్బాక: కోట్లు వెచ్చించిన ప్రజాధనం నిరుపయోగంగా మారుతోంది. దుబ్బాక పట్టణంలో సుమారు రూ.4 కోట్ల నిధులతో మోడల్ బస్టాండ్‌ను నిర్మించారు. కానీ ప్రయాణికులకు కల్పించాల్సిన మౌలిక వసతులను పూర్తిగా విస్మరించారు. ఇటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అటు పాలకుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల బస్టాండ్‌ను ప్రారంభించారు. కానీ సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూత్రశాలల నిర్మాణం లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలోనే మూత్రవిసర్జన చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. కేవలం 3 మరుగుదొడ్లే ఉండడం వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

నిర్వహణ అధ్వానం..

మరుగుదొడ్లు ఉన్నా వాటికి సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థాలు బయటకు వెళ్లేందుకు మురికి కాల్వ లేకపోవడంతో మురికి నీరు మరుగుదొడ్ల వెనుకాలే మడుగు కడుతోంది. దీంతో బస్టాండ్ ఆవరణ దుర్గంధంతో కంపుకొడుతోంది. బహిరంగ మూత్ర విసర్జన చేయడంతో దాని నుంచే వచ్చే దుర్గంధంతో చుట్టూ పక్కల దుకాణాల యజమానులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మోడల్ బస్టాండ్‌ను తీర్చిదిద్దిన అధికారులు మూత్రశాలల నిర్మాణం ఎందుకు చేపట్టడడం లేదంటూ ప్రయాణికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా..

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యతకు తూట్లు పొడుస్తున్నాయి. ఇటీవల దుబ్బాకలో సుమారు 4 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన నూతన బస్టాండ్ నిర్మాణంలో భాగంగా ప్రహరీ నాణ్యతలో లోపాలు కలగడంతో సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ప్రహరీ కుప్పకూలింది. దీంతో బస్టాండ్ నిర్మాణంలో కూడా నాణ్యత లోపించవచ్చని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలను ఖర్చు పెడుతుంటే నిర్మాణ పనులు మాత్రం మున్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. సిమెంట్, ఇటుకలతో నిర్మించిన ప్రహరీని కారు ఢీకొడితే, కారు నుజ్జునుజ్జు కావాల్సింది పోయి, ప్రహరీ కూలడంతో నాణ్యతపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొడితే కూలిపోయే ప్రహరీ నిర్మించిన సదరు కాంట్రాక్టర్లపైనే కాకుండా పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నూతన బస్టాండ్ భవన నిర్మాణ నాణ్యతపై ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

చర్యలు తీసుకోవాలి



కాంట్రాక్టర్లు నాణ్యత లేని పనులు చేపడితే ఇలాంటి సంఘటనలే పునరావృతమవుతాయి. బస్టాండ్ నిర్మాణంలో నాణ్యత లేని పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై, పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రజల సౌకర్యార్థం చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి.

– మాడబోయిన శ్రీకాంత్, దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు

మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి



బస్టాండ్‌ను నిర్మించిన అధికారులు ప్రయాణికులకు మరుగుదొడ్లు నిర్మించకపోవడం బాధాకరం. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రజావసరాలకు మోడల్ బస్టాండ్ నిర్మించి మరుగుదొడ్లు విస్మరించడం సిగ్గుచేటు. వెంటనే ప్రయాణికులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం చేపట్టాలి.

– ఆకుల భరత్, మున్సిపల్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు

మైనార్టీ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో అవకాశం



దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల

దుబ్బాక: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉచిత విద్యతో పాటు వసతిని కల్పించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 6 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. దుబ్బాకలో బాయ్స్, సిద్దిపేటలో బాయ్స్, గర్ల్స్, గజ్వేల్‌లో బాయ్స్, గర్ల్స్, హుస్నాబాద్‌లో గర్ల్స్, పాఠశాలలున్నాయి. జిల్లాలోని 5 పాఠశాలల్లో 5వ తరగతిలో 80 సీట్ల చొప్పునఉండగా దుబ్బాకలో 40 సీట్లు ఉన్నాయి. ఆరు పాఠశాలలో కలిపి మొత్తం 440 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి మొత్తం 480 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మిగతా తరగతుల్లో సీట్ల ఖాళీలను బట్టి ప్రవేశం కల్పిస్తారు. ఈ విద్యాలయల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుంది. ప్రవేశానికి http://tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో ముస్లింలకు 51, క్రిస్టియన్లకు 5, జైనులు, పార్శిలు, సిక్కులు, బౌద్ధులకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 60 సీట్లు, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓసీలకు రెండు చొప్పున మొత్తం 20 సీట్లు కేటాయించారు. దరఖాస్తులకు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అవసరం.

అమ్మ అనుగ్రహంతో సస్యశ్యామలం



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

నంగునూరు(సిద్దిపేట): మహంకాళీ అమ్మ అనుగ్రహంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని పూజలు చేశామని ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్ధన్నపేటలో జరుగుతున్న మాతమ్మ, మంకాళమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాల్లో శనివారం మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకవ్వ, ఎంపీటీసీ తిరుపతి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లిలో జరుగుతున్న పెద్దమ్మ కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అంక్షాపూర్ మాజీ సర్పంచ్ బొంగోని లక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ తల్లి జానవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం బాధిత కుటుంబాలను మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్త యాదగిరి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



ఎన్నికల విధానాన్ని పరిశీలిస్తున్న రజిత

హుస్నాబాద్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. పట్టణంలోని సీవీ రామన్ పాఠశాలలో శనివారం మాక్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు విద్యాపరంగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు అనే అంశంపై నమూనా ఎన్నికల విధానాన్ని ప్రత్యక్షంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే ఎన్నికలు నిర్వహించడంతో భవిష్యత్‌లో మంచి నాయకులను ఎన్నుకునే స్ఫూర్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నల్ల రాంచంద్రారెడ్డి, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, పాఠశాల కరెస్పాండెంట్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

మద్దూరు(హుస్నాబాద్): పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో చేపట్టిన పనుల్లో వేగం పెంచి తర్వగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని రేబర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీటి సరఫరా తదితర సౌకర్యాలు ఈ పథకంలో కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు మన బడి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో పరశురాములు, పంచాయతీ కార్యదర్శి మాధవ్, పాఠశాల హెచ్‌ఎం ఉన్నారు.

'కార్మికులకు అండగా ప్రభుత్వం'



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ అండగా నిలుస్తోందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం కేలండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందని, అందులో భాగంగానే వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అసంఘటిత రంగ, భవన నిర్మాణ, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా, ప్రసూతి, వివాహ, సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేశ్, నాయకులు రాజు, కొలిపాక మధు, బాబు, మల్లేశం, నర్సింహులు, సలీం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సీఎం క్యాంపు కార్యాలయం పక్కన సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, స్థానిక కౌన్సిలర్ శీర్ల శ్యామలమల్లేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



మగ్దుంపూర్ పాఠశాలలో సూర్య నమస్కారం చేస్తున్న విద్యార్థులు



సరస్వతీ శిశుమందిర్‌లో సూర్య నమస్కారాల కార్యక్రమంలో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రథసప్తమి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని సంతోషీమాత ఆలయంలో ఆలయ కార్యవర్గ సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు యోగాసనాలు వేశారు. సంతోషీమాత ఆలయం, గ్రంథాలయ భవనంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతాంజలి యోగా సమితి, వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో నిత్య యోగ సాధన ఆదివారం నుంచి రోజు ఉదయం యోగా సాధన నిర్వహిస్తామని సంతోషీమాత ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్, ఆలయ ఈఓ విశ్వనాథ్‌శర్మ, పాలకమండలి సభ్యులు గాదగోని సత్యంగౌడ్, గ్యాదరి కృష్ణ, గండె మాధురి, కొమురవెల్లి కల్యాణి, పోకల సంతోష్‌కుమార్, ప్రభాకర్ తెలిపారు.

సరస్వతీ శిశుమందిర్‌లో..

సరస్వతీ శిశుమందిర్‌లో రథసప్తమి పురస్కరించుకొని సూర్య నమస్కార్ (సూర్య నమస్కారం) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో రేగుల రాకేష్ ప్రథమ స్థానం, శివాజీ ద్వితీయ స్థానం, హరిణి తతీయ స్థానంలో నిలిచారు. ఈ సూర్య నమస్కార యజ్ఞంలో మొత్తం విద్యార్థులందరూ కలిసి 6,622 సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు మోతుకు నరేష్‌కుమార్, విద్యార్థులు, ఆచార్యుల బృందం పాల్గొన్నారు.

సూర్య నమస్కారంతో సంపూర్ణ ఆరోగ్యం

నంగునూరు(సిద్దిపేట): ప్రతీ రోజు సూర్య నమస్కారం చేయడంతో శరీరానికి డి విటమిన్ అందడంతో పాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయని యోగా శిక్షకుడు, ఉపాధ్యాయుడు బొజ్జ అశోక్, హెచ్‌ఎం నాగేందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సూర్య నమస్కారం చేయిస్తూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, సమ్మయ్య, ప్రసన్న రాజ్యలక్ష్మి, రమేశ్, రాజు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన అవసరమని పబ్లిక్ సర్వెంట్స్ హోం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో భవన్‌లో సర్వెంట్స్ హోం ఆధ్వర్యంలో యోగ, సూర్య నమస్కారాలు నిర్వహించారు.

వైద్య సేవలు అద్భుతం



జిల్లా అధికారులు, సిబ్బందితో కేంద్ర బృందం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండో రోజు శనివారం కేంద్ర బృందం సభ్యులు అంజియాస్ వాసంత్, మమత జిస్వాల్ పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, రికార్డుల నమోదును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ల్యాబ్‌లో ఉండాల్సిన వసతులు, పరికరాలు, రిపోర్టుల తయారీపై ఆరా తీశారు. ఈసందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు కుకునూరుపల్లి ఆస్పత్రి పనితీరును పరిశీలించామని.. ఇక్కడ గుర్తించిన విషయాలను కేంద్రానికి నివేదిస్తామన్నారు. అనంతరం కేంద్ర బృందంను సర్పంచ్ పొల్కంపల్లి జయంతి దంపతులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కాశీనాథ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు శ్రీనివాస్, విజయరాణీ, ఆస్పత్రి వైద్యులు బల్‌భీర్‌సింగ్, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలి

గజ్వేల్: బీఆర్ఎస్‌తో దేశంలో గొప్ప మార్పునకు అడుగులు పడనున్నాయని ఆ పార్టీ గజ్వేల్, మర్కూక్ మండలాల అధ్యక్షులు బెండె మధు, కర్ణాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు జీర్ణించుకోలేకపోతున్నాయని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలని ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌తో కలిసి నడవాల్సిందేనని చెప్పారు.

బీఆర్ఎస్ బలోపేతానికి చర్యలు



కమిటీ నాయకులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌ను మరింతగా పటిష్టవంతం చేసేందుకు కొత్తగా కమిటీలు వేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 39వ బూత్ కమిటీ బీఆర్ఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బూత్ కమిటీ అధ్యక్షుడిగా అంకం దుబ్బరాజం, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా గోనె మధు, మహిళా విభాగం ఇన్‌చార్జిగా దుద్దెడ అరుణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వంశీకృష్ణాగౌడ్, రాష్ట్ర నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి, 18వ వార్డు అధ్యక్షులు భానుచందర్, మహిళా అధ్యక్షురాలు రేపాక పుష్పాంజలి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ లింగరాజ్‌పల్లి గ్రామాభివృద్ధికి కృషి

దుబ్బాక: తెలంగాణ ఉద్యమంలో సమయంలో కీలక పాత్ర పోషించిన దౌల్తాబాద్ మండలం లింగరాజ్‌పల్లి గ్రామం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు.

◆ సీపీఐ జనగామ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా అశోక్

చేర్యాల(సిద్దిపేట): సీపీఐ జనగామ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా అందె అశోక్ ఎన్నికైనట్లు ఆ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీ.హెచ్.రాజారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు ప్రకటించారు. శుక్రవారం జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో 13మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ఆకుల శ్రీనివాస్, పాతూరి సుగుణమ్మ, సొప్పరి సోమయ్య, మంగళంపల్లి జనార్దన్, ఈరి భూమయ్య, పాతురి ప్రశాంత్, వలబోజు నర్సింహచారి, చల్లోజు మల్లేశం, కుడిక్యాల బాలుమోహన్, గుంటి కుమారస్వామి, బంటు పాండుకు కమిటీలో చోటు దక్కింది. తన ఎన్నికకు సహకరించిన జనగామ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ ముదిరాజ్ మహిళా కార్యవర్గం ఎన్నిక

నంగునూరు(సిద్దిపేట): ముదిరాజ్ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం తమవంతుగా కృషి చేస్తామని సంఘం మహిళా అధ్యక్షురాలు జంగిటి రాజమణి అన్నారు. ముదిరాజ్ సంఘం నంగునూరు గ్రామ మహిళా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా కొండిల్ల వనజ, ప్రధాన కార్యదర్శిగా సొప్పరి మంజుల, కార్యవర్గ సభ్యులుగా బీమరి లలిత, గుండబోయిన కవిత, గొడుగు భూలక్ష్మి, గొరబోయిన మంజుల, బోనగిరి నర్సవ్వ, కన్నారపు స్వప్న ఎన్నికయ్యారు.

◆ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌రూరల్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని స్వేచ్ఛ భావ ప్రకటన జేఏసీ రాష్ట్ర నాయకుడు కోల జనార్దన్‌గౌడ్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌లు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు ఏగొండస్వామి, వేణు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ రైతు కుటుంబాలకు అండగా బీమా

వర్గల్(గజ్వేల్): రైతు కుటుంబాలకు అండగా ఉండేందుకే సీఎం కేసీఆర్ రైతు బీమా పథకం అమలు చేస్తున్నారని వర్గల్ మండల రైతు కో–ఆర్డినేటర్ పాశం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గౌరారంలో ఇటీవల రైతు కమ్మరి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందగా శనివారం అతని కుటుంబీకులను శనివారం పరామర్శించారు. ప్రభుత్వం రైతుబీమా ద్వారా రూ.5లక్షల ఆర్థికసాయం అందజేసి ఆదుకుంటుందని కుటుంబీకులకు భరోసా ఇచ్చారు.

◆ అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోండి

హుస్నాబాద్: పట్టణంలో విచ్చలవిడిగా పెరుగుతున్న అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కొంతమంది రియల్టర్లు ఎకరాల కొద్ది భూములను కొనుగోలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీనివాస్, మల్లేశం, రాజయ్య, యాదగిరి, సారయ్యలు పాల్గొన్నారు.

◆ భవన నిర్మాణ కార్మిక తాపీ సంఘం కార్యవర్గం

హుస్నాబాద్: పట్టణంలోని కార్మిక సంఘ భవనంలో శనివారం భవన నిర్మాణ తాపీ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 400 మంది కార్మికులు పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడిగా యామ కొమురెల్లి 47 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. కార్యదర్శిగా చెన్నబోయిన సంపత్, కోశాధికారిగా నలువాల ఆనంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జాల ఆగయ్య, గోనెల మధూకర్, హన్మంత్, పుప్పాల శ్రీనివాస్, నార్లపురం రమేశ్, జాల లక్ష్మయ్య పర్యవేక్షించారు.

◆ సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామంలో మంజూరైన రూ.15లక్షల నిధుల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి సర్పంచ్ గుగులోతు లక్ష్మి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేముల శ్రీనివాస్, ఉపసర్పంచ్ కవితతిరుపతి, నాయకులు రాంబాబునాయక్, లింగ నాగేందర్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలల బలోపేతానికి కృషి

కొండపాక(గజ్వేల్): పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి గడా నిధుల్లోంచి మంజూరైన రూ.60 లక్షలతో నిర్మించే భవన నిర్మాణ పనులకు శనివారం సర్పంచ్ లక్ష్మితో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమత పాల్గొన్నారు.

◆ నియామకం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన చిలుముల రామ్మోహన్ ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త గట్టు శ్రీనివాస్, పులి దేవేందర్‌లు శనివారం నియామకపత్రం అందించారు.

◆ బాధిత కుటుంబానికి చేయూత

దుబ్బాక: దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన చేగుంట రాజుగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కడు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న బాధిత కుటుంబాన్ని చూసి చలించిన గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు జమ చేశారు. జమ చేసిన విరాళాలు రూ.80 వేలను శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి ఎంపీటీసీ తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్, నాయకులు తదితరులున్నారు.